

# యాసంగి సేద్యానికి రెడీ

**నిర్మల్ జిల్లాలో 2.70 లక్షల ఎకరాల్లో సాగుకు అవకాశం**

- అత్యధికంగా లక్ష ఎకరాల్లో వరి పంట
- 85 వేల ఎకరాల్లో మక్క, 60 వేల ఎకరాల్లో శనగ
- 20-30వేల ఎకరాల్లో నువ్వు, సన్‌ఫ్లవర్, వేరుశనగ తదితర పంటలు
- ఎరువులు, విత్తనాలు సకాలంలో అందేలా అధికారుల ఏర్పాట్లు

నిర్మల్, డిసెంబర్ 8(నమస్తే తెలంగాణ): నిర్మల్ జిల్లా వ్యాప్తంగా గ్రామస్థాయిలో సేకరించిన సమాచారంతో ఈసాగు ప్రణాళికను రూపొందించారు. అందుకనుగుణంగా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటివరకు అధికారులు తయారు చేసిన ప్రణాళిక ఆధారంగా నిర్మల్ జిల్లాలో ఈ యాసంగిలో 2. 70 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేయనున్నారని అంచనాలు రూపొందించారు. ఆయా పంటల సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సైతం అందుబాటులో ఉంచేందుకు అవసరమైన ప్రణాళికను వ్యవసాయ శాఖ అధికారులు రూపొందిస్తున్నారు.

### వరి, మక్కవైపే మొగ్గు..

వచ్చే యాసంగి సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా అత్యధికంగా లక్ష ఎకరాల్లో వరి సాగవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా వరి తర్వాత అధికంగా 85 వేల ఎకరాల్లో మక్క, 60 వేల ఎకరాల్లో శనగ పంటలు సాగు చేసేందుకు రైతులు మొగ్గు చూపుతున్నట్లు అధికారులు గుర్తించారు. చాలా చోట్ల ఇప్పటికే ఈ పంటలను వేశారు. మరో 25 వేల ఎకరాల్లో నువ్వు,, పొద్దుతిరుగుడు, ఎర్ర జొన్న, గోధుమ, వేరుశనగ తదితర పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. జిల్లాలోని వ్యవసాయ విస్తరణాధికారుల ద్వారా పూర్తిస్థాయిలో సమాచారం సేకరించి యాసంగి సాగు ప్రణాళికను రూపొందించారు.

### అందుబాటులో ఎరువులు, విత్తనాలు

జిల్లా వ్యాప్తంగా ఈ యాసంగి సీజన్‌లో సాగు చేయనున్న పంటల వివరాలతో ప్రణాళిక రూపొందించిన అధికారులు... విత్తనాలు, ఎరువులు ఎంతమేరకు అవసరమవుతాయో అంచనాలు తయారు చేశారు. అన్నిరకాల పంటలకు కలిపి 30 వేల మెట్రిక్ టన్నుల యూరియా, 12 వేల నుంచి 15 వేల మెట్రిక్ టన్నుల డీఏపీ, 18 వేల మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు అవసరమవుతాయని అంచనా వేశారు. కాగా వీటిలో ఇప్పటికే 15వేల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందబాటులో ఉన్నాయి. అలాగే 4 వేల మెట్రిక్ టన్నుల డీఏపీ 6,500 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయి. ఏ పంటకు ఎన్ని క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయనేది ముందుగానే ప్రణాళిక రూపొందించిన వ్యవసాయ అధికారులు ప్రస్తుతం అందుబాటులో ఉన్న నిల్వలు పోను మిగతా ఎరువులు, విత్తనాలను తెప్పించేందుకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు. రైతులు పంటలు వేసిన తర్వాత ఏ నెలలో ఎంత మొత్తంలో ఎరువులు అవసరమవుతాయో ఆయా నెలల వారీగా ఎరువులు మార్కెట్లో అందుబాటులో ఉండేలా చూడనున్నారు. ఎరువులు, విత్తనాల కొరత రాకుండా అవకాశమున్న చోట ముందుగానే బఫర్ స్టాకులను కూడా ఏర్పాటు చేయనున్నారు.

### డిమాండ్ ఉన్న పంటలను వేయాలి..



*జిల్లాలోని రైతులు ఈ యాసంగి సీజన్‌లో వరిపంట సాగును తగ్గించుకొని, మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలి. ఆరుతడి పంటల్లో ప్రధానంగా నూనె గింజల పంటలైన పొద్దుతిరుగుడు, కుసుమ, నువ్వులు, వేరుశనగ తదితర పంటలను అధికమొత్తంలో వేయాలి. అలాగే ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం ఎక్కువగా ప్రోత్సాహాన్ని కల్పిస్తున్నది. దీనిని రైతులు సద్వినియోగం చేసుకొని పెద్ద ఎత్తున ఆయిల్ పామ్ సాగుకు రైతులు ముందుకు రావాలి.*

**- అంజిప్రసాద్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, నిర్మల్**

# మంత్రివర్గంలో చోటేది?



గడ్డం వివేక్



గడ్డం వినోద్



ప్రేమ్‌సాగర్‌రావు

- ముగ్గురు సీనియర్ నేతల ఆశలు గల్లంతు
- ఢిల్లీకిపోయి పైరవీ చేసినా దక్కని ఫలితం
- రెండో దఫా మంత్రివర్గ విస్తరణ లేకపోతే పరిస్థితి ఏమిటన్న ఆందోళన
- సీనియర్లను విస్మరించారంటూ కేడర్‌లో అసహనం

**ఉమ్మడి జిల్లాకు రెండు మంత్రి పదవులని జోరుగా ప్రచారం**

మంచిర్యాల, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రాష్ట్రంలో గురువారం కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. ముఖ్యమంత్రితో పాటు 12 మంది మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. కానీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి సీనియర్ నాయకులెవ్వరికీ మంత్రి పదవి దక్కలేదు. ఉమ్మడి జిల్లాలోని మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్, ఖానాపూర్ నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచారు. ఈ నలుగురిలో ముగ్గురు సీనియర్ నాయకులు ఉండగా, వీరిలో ఇద్దరికి కచ్చితంగా మంత్రి పదవులు ఇస్తారనే ప్రచారం జరిగింది. ఎన్నికల రిజల్ట్ వచ్చిన మరుక్షణమే కొందరు మా సారు.. మంత్రంటే.. మా సారు మంత్రంటూ.. ఇంకొందరైతే ఒకడుగు ముందుకేసి మా సారు డిప్యూటీ సీఎం అంటూ.. తెగ ప్రచారం చేశారు. కానీ కాంగ్రెస్ అధినాయకత్వం, రాష్ట్రంలోని నాయకత్వం ఉమ్మడి జిల్లా నాయకులకు మంత్రి పదవి విషయంలో హ్యాండ్ ఇచ్చింది. దీంతో కాంగ్రెస్ పార్టీకి ఉమ్మడి జిల్లాలో పెద్ద దిక్కుగా ఉన్న ఆ సీనియర్ నాయకుల ఆశలు గల్లంతయ్యాయి. గతంలో మంత్రిగా పని చేసి పదేళ్ల తర్వాత ఎమ్మెల్యేగా గెలిచిన ఓ నేత ఏకంగా ఢిల్లీకి పోయి సోనియాగాంధీ, మల్లికార్జున ఖర్గేను కలిసి పైరవీ చేయించుకున్నట్లు తెలిసింది. అంత చేసినా మంత్రివర్గంలో ఆయనకు చోటుదక్కకపోవడం ఇప్పుడు జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది.

### మంత్రి అవుదామనుకున్నా..!

మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు (పీఎస్సార్) జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి పెద్ద దిక్కుగా ఉంటున్నారు. దీంతో ఈ గవర్నమెంట్‌లో ఆయనకు మంత్రి పదవి కచ్చితంగా వస్తుందని అంతా భావించారు. మరోవైపు బెల్లంపల్లి నుంచి గెలిచిన గడ్డం వినోద్ లేదా చెన్నూర్ నుంచి గెలిచిన ఆయన తమ్ముడు గడ్డం వివేక్‌లలో ఎవరికో ఒకరికి మంత్రి పదవి వస్తుందన్న ప్రచారం జోరుగా సాగింది. మంత్రి పదవి, పెద్దపల్లి ఎంపీ సీటు ఇస్తారనే హామీతోనే గడ్డం వివేక్ పార్టీలో చేరినట్లు తీవ్రమైన చర్చ నడిచింది. ఒక దశలో ఇద్దరు అన్నదమ్ముల మధ్య మంత్రి పదవి కోసం పోటీ నెలకొనడంతో పీఎస్సార్‌కు ఇవ్వకున్నా వీరిద్దరిలో ఎవరికో ఒకరికి కచ్చితంగా పదవి వస్తుందని అందరూ భావించారు. కానీ కొత్త కేబినేట్‌లో వీరెవ్వరూ లేకపోవడంపై క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ కేడర్ అసహనం వ్యక్తం చేస్తున్నది. ఓ ఎమ్మెల్యే అయితే తాను గెలిస్తే ఏ పార్టీ అధికారంలో ఉన్నా తానే మినిస్టర్ అని చెప్పుకున్నారు. తీరా ఇప్పుడు మంత్రివర్గంలో ఆయన పేరే లేకుండా పోయింది. దీంతో ఆయన మంత్రి అవుతారనే ఆశతో కాంగ్రెస్ పార్టీలో చేరిన సెకండ్ క్యాడర్ అయోమయంలో పడిపోతున్నది. మిగిలిన జిల్లాలకు మంత్రి పదవులు ఇచ్చి.. ఆదిలాబాద్‌కు మాత్రం అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భౌగోళికంగా, గత పాలనను చూసుకున్నా ఆదిలాబాద్ జిల్లాలో ఒక్కరూ లేదా ఇద్దరికి మంత్రి పదవులు ఇవ్వాలి. అది కుదరని పక్షంలో ఒకరికి మంత్రిపదవి, ఒకరికి ప్రభుత్వ విప్ హోదా కల్పించాలి. కానీ కాంగ్రెస్ పార్టీ ఇవేవీ లెక్కలోకి తీసుకోకుండా ఇష్టం వచ్చినట్లు మంత్రి వర్గాన్ని విస్తరించి, ఆదిలాబాద్ జిల్లాను చిన్నచూపు చూసిందనే చర్చ నడుస్తున్నది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ముగ్గురు ఎమ్మెల్యేలకు, కరీంనగర్, వరంగల్, నల్గొండ, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలో ఇద్దరేసి ఎమ్మెల్యేల చొప్పున మంత్రి పదవులు ఇచ్చారు. కానీ ఆదిలాబాద్ నుంచి ఏ ఒక్కరికీ ఇవ్వలేదు. రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాల్లోకి నాయకులకు ఏ మాత్రం తీసిపోకుండా ఉమ్మడి జిల్లాలో హేమాహేమీలుగా పేరొందిన నాయకులను విస్మరించడం ఏమిటనేది మిలియన్ డాలర్ ప్రశ్నగా మిగిలిపోయింది. రేవంత్‌రెడ్డి టీపీసీసీ అధ్యక్షుడిగా ఏర్పాటు చేసిన తొలి సభను, భట్టి పాదయాత్రను విజయవంతం చేసినా మా నాయకులను పరిగణలోకి తీసుకోలేదని కాంగ్రెస్ పార్టీ కిందిస్థాయి నాయకులు నారాజ్ అవుతున్నారు. పోనీ రెండో విడుత మంత్రి వర్గ విస్తరణలోనైనా చోటు దక్కిస్తారో చూద్దామనుకుంటే... ఒకవేళ రెండో విడుత మంత్రివర్గ విస్తరణ లేకుంటే తమ పరిస్థితి ఏమిటని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మింగలేక కక్కలేక జుట్లు పీక్కుంటున్నారు.

# తెల్లబంగారానికి తెగులు



అకాల వర్షాలతో ఎర్రబారుతున్న పత్తి పంట



- వర్షాలతో దెబ్బ తింటున్న పత్తి
- నల్లబడిపోతున్న ఆకులు, కాయలు
- దిగుబడిపై తీవ్ర ప్రభావం
- ఆందోళన చెందుతున్న రైతులు

కుమ్రం భీం ఆసిఫాబాద్, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ) : వర్షాలు కురుస్తుండడంతో తెల్లబంగారినికి తెగులు సోకుతుంది. పత్తిపంట చేతికొస్తున్న వేళ వర్షం రైతులను ఆందోళనకు గురిచేస్తున్నది. చెట్టుపైనున్న పత్తితో పాటు కాయలు, ఆకులకు నల్ల మచ్చలు వచ్చి రాలిపోతున్నాయి. ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి రైతులు సాగు చేయగా, దిగుబడిపై తీవ్ర ప్రభావం పడే అవకాశముంది. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో దాదాపు 4 లక్షల 50 వేల ఎకరాల సాగుభూమి ఉండగా, ఇందులో దాదాపు 3.60 లక్షల ఎకరాల్లో ఈ ఏడాది పత్తి సాగు చేస్తున్నారు. రెండేళ్లుగా పత్తిలో వచ్చిన దిగుబడులు, గిట్టుబాటు ధర కారణంగా గతేడాది కంటే ఈ యేడాది సుమారు 5 వేల ఎకరాల్లో అదనంగా పత్తి సాగు చేశారు. ఈ ఏడాది కురిసిన వర్షాలు ఆరుతడి పంటలకు అనుకూలంగా ఉండగా, పత్తి పంట బాగా పెరిగింది. గతేడాది కంటే దిగుబడి బాగుంటుందని రైతులు, అధికారులు అంచనాలు వేశారు. పత్తి పంట చేతికి వస్తున్న సమయంలో వర్షాలు రైతుల ఆశలపై నీళ్లు చల్లుతున్నాయి. తుఫాను ప్రభావంతో కురిసిన వర్షాలతో పత్తి కాయలు నల్లబడి రాలిపోతున్నాయి. దీనికి తోడు ఆకులకు మచ్చలు, ఇతర తెగుళ్లు వస్తుండడంతో పత్తి చెట్లు మాడిపోతున్నాయి. బాగా పెరిగిన పత్తి చెట్లకు సరైన విధంగా గాలి.. వెలుతురు, సూర్యరశ్మి తగులకపోవడం, దీనికి తోడు రోజూ మబ్బులు కమ్ముకొని.. చినుకులు రాలడంతో పత్తికి తెగుళ్లు వస్తున్నాయని అధికారులు అంటున్నారు. జిల్లాలో ఎక్కువగా ఎత్తుపల్లాల భూములు ఉండడంతో లోతట్టు ప్రాంతాల్లోని చేలల్లో నీరునిలిచి ఉండడం వల్ల భూమి ఆరడం లేదు. దీంతో పత్తి చేలల్లో గడ్డికూడా బాగా పెరుగుతోంది. దీంతో పత్తి చెట్టు నల్లగా మారడం, ఆకులు ఎండిపోతున్నాయి. పత్తికాయలు చెట్టుపై నిలువకుండా రాలిపోతున్నాయి. దీనికితోడు పొగమంచు కమ్ముకొంటుండడంతో పత్తి పంటకు వివిధ రకాల తెగుళ్లసోకే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో పత్తి దిగుబడి చాలావరకు తగ్గే ప్రమాదం ఉందంటున్నారు.

### దిగుబడిపై ప్రభావం..

వాతావరణ పరిస్థితులు ఇలాగే ఉంటే పత్తి పంట దిగుబడిపై తీవ్రమైన ప్రభావం చూపే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. గతేడాది సుమారు లక్షా 30 వేల క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందని అంచనా వేయగా.. ఆ మేరకు దిగుబడి వచ్చింది. ఈ ఏడాది అదనంగా 5 వేల ఎకరాల్లో సాగు పెరిగింది. దీంతో లక్షా 50 వేల నుంచి లక్షా 80 వేల క్వింటాళ్ల దాకా పత్తి దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. పంట చేతికొచ్చే సమయంలో వాతావరణ మార్పుల కారణంగా దిగుబడి తగ్గే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు.

### సస్య రక్షణ చర్యలు తప్పనిసరి..

ప్రస్తుత సమయంలో పత్తికి వస్తున్న తెగుళ్లను నివారించేందుకు రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. దీంతో తెగుళ్ల బెడద కొంత మేరకు తగ్గడంతో పాటు కాయలు చెట్ల నుంచి రాలిపోయే ప్రమాదం నుంచి నివారించవచ్చని పేర్కొంటున్నారు. మొదటి దశలో రావాల్సిన పత్తి ఇప్పటికే నష్టపోయామని రైతులు బాధపడుతుండగా, తాజాగా మబ్బులు మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి.



మంచు ముసుగులో ఆదిలాబాద్ సూపర్‌స్పెషాలిటీ దవాఖాన



ఆదిలాబాద్ నుంచి నాగ్‌పూర్ జాతీయ రహదారిపై మంచు

# మంచుకురిసే వేళలో..

- మరో కశ్మీరంగా అడవుల జిల్లా
- ఎన్‌హెచ్-44పై వాహనదారుల ఇక్కట్లు

*మిజాంగ్ తుఫాన్ ప్రభావం, చలికాలపు వేళ ఆదిలాబాద్ పట్టణంలో ఉదయం ఇండ్లు, కార్యాలయాలు మంచు తెర కప్పుకున్నాయి. ఆదిలాబాద్ పట్టణంలోని కలెక్టర్, ఎన్టీఆర్ తదితర చౌరస్తాలన్నీ పొద్దున దట్టంగా మంచు కమ్మి ఉన్నాయి. ఆదిలాబాద్ పట్టణంలోని రిమ్స్ సూపర్ స్పెషాలిటీ దవాఖాన వద్ద శుక్రవారం ఉదయం ఇలా పొగమంచు వెనుక దాగింది.*


**- ఎదులాపురం/ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 8**



ఆదిలాబాద్ కలెక్టర్ చౌరస్తాలో మంచు దుప్పటి




గుడిహత్నూర్ మండలం సీతాగొంది వద్ద పొలంపై





ఆదిలాబాద్ ఎన్టీఆర్ చౌక్‌లో మంచు తెర



ఆదిలాబాద్ జిల్లాకేంద్రంపై కమ్ముకున్న పొగమంచు



ఆదిలాబాద్ నుంచి నాగ్‌పూర్‌కు వెళ్లే జాతీయ 44 రహదారిపై కమ్ముకున్న పొగమంచు



ఆదిలాబాద్ పట్టణంలో కమ్ముకున్న మంచు



సత్యదేవుని దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు

# గూడెంలో వైభవంగా కార్తీక బహుళ ఏకాదశి

**393 జంటల సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు**

దండేపల్లి, డిసెంబర్ 8 : దండేపల్లి మండలం గూడెం రమాసహిత ఆలయంలో కార్తీక బహుళ ఏకాదశి పర్వదినం సందర్భంగా శుక్రవారం భక్తుల రద్దీ కొనసాగింది. ఆయా ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన ప్రజలు ముందుగా పవిత్ర గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. గోదావరిలో కార్తీక దీపాలు వదిలి గంగమ్మ తల్లికి పూజలు చేశారు. అనంతరం గుట్ట కింద రావి చెట్టు వద్ద, గుట్ట పైన గల ధ్వజస్తంభం వద్ద మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. 393 మంది సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించారు. అనంతరం అభిషేకాలు, అర్చనలు ప్రత్యేక పూజలు చేశారు. వ్రతాల కోసం ప్రత్యేకంగా రెండు మండపాలను ఏర్పాటు చేశారు. జైపూర్ ఏసీపీ నరేందర్ దంపతులు సత్యనారాయణస్వామి వ్రతాన్ని ఆచరించారు. అర్చకులు తీర్థప్రసాదాలు, ఆశీర్వచనాలు అందించారు.



వ్రతం ఆచరిస్తున్న ఏసీపీ దంపతులు



సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు